క్లుప్తంగా

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



కరచాలనం చేస్తున్న శ్రీనుబాబు

మంథని: మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన శ్రీపాద కప్ క్రికెట్ పోటీలను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోదరుడు శ్రీనుబాబు గురువారం ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని బ్యాటింగ్ చేసి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు.

ఆరుగ్యారంటీలపై అవగాహన

కమాన్‌పూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరుగ్యారంటీ పథకాలపై మండలంలోని రొంపికుంట గ్రామంలో గురువారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో ప్రజలకు అవగాహన కల్పించారు. కళాకారులు కొండ్ర వెంకన్నగౌడ్, జనగామ రాజానర్సు, ఈదునూరి పద్మ, మల్లేశం, శ్రావణ్, సలేంద్ర రాజన్న, రమ, రేణుక, శ్రీవల్లి పాల్గొన్నారు.

బసంత్‌నగర్‌లో..

పాలకుర్తి: బసంత్‌నగర్‌లోని వర్కర్స్‌క్లబ్ ఆవరణలో గురువారం రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై స్థానికులకు కళాకారులు పాటల ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి యువత విలువైన జీవితాలను నాశనం చేసుకుంటోందని, తద్వారా ఎదురయ్యే అనార్థాల గురించి కళాకారులు తమ పాటల ద్వారా వివరించారు. కళాకారులు దయానర్సింగ్, బుర్ర శంకర్‌గౌడ్, స్నేహలత, సరిత, వెంకటస్వామి, స్పందన, శ్వేత, స్వప్న, రవీందర్ పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరిస్తా

జ్యోతినగర్: ప్రజల సమస్యలు పరిష్కరిస్తానని రామగుండం తహసీల్దార్ కుమారస్వామి హామీ ఇచ్చారు. రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్‌లోని న్యూపీకే రామయ్యకాలనీలోని ప్రజలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడారు. ఒడిశా నుంచి వచ్చి చాలా ఏళ్లుగా ఇక్కడ నివాసముంటున్నామని, తమ పిల్లల ఉన్నత చదువులకు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదని తదితర సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన తహసీల్దార్ సమస్యలను నెలరోజుల్లోగా పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు. సేవా స్ఫూర్తి వ్యవస్థాపక అధ్యక్షులు మడిపెల్లి మల్లేశ్, తహసీల్దార్ కుమారస్వామికి కృతజ్ఞతలు తెలిపారు.

వ్యవసాయంపై అవగాహన

రామగిరి: విద్యార్థులు చదువుతో పాటు వ్యవసాయరంగంపై అవగాహన కలిగి ఉండాలని సర్పంచ్ గంట పద్మ సూచించారు. గురువారం మండలంలోని కల్వచర్ల ప్రభుత్వ పాఠశాలలో మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన విద్యార్థులతో కలిసి పాఠశాల విద్యార్థులకు జాతీయ సేవా పథకంలో భాగంగా స్వచ్ఛభారత్, హరితహారం, వ్యవసాయరంగం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కృషివిజ్ఞాన శాస్త్రవేత్త డా.వినోద్‌కుమార్, ఉపసర్పంచ్ వేము కనకయ్య, ప్రధానోపాధ్యాయులు వనజ, వార్డుసభ్యులు బాపన్న పాల్గొన్నారు.

సబ్బితం సర్పంచ్, ఉపసర్పంచ్ సస్పెన్షన్

పెద్దపల్లిరూరల్: మండలంలోని సబ్బితం సర్పంచ్ చుంచు సదయ్య, ఉపసర్పంచ్ మాదాసి శ్రీనివాస్‌ను సస్పెన్షన్ చేస్తున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి తెలిపారు. సబ్బితం గ్రామానికి చెందిన కందుల అశోక్ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై చేసిన ఫిర్యాదుపై మండల పంచాయతీ అధికారి సుదర్శన్ విచారణ జరిపారు. ఆయన ఇచ్చిన నివేదిక ఆధారంగా సర్పంచ్ సదయ్య, ఉపసర్పంచ్ శ్రీనివాస్ పంచాయతీ నిధులు రూ.2.02లక్షలు దుర్వినియోగం చేసినట్లు గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే అప్పటి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సతీశ్, శ్రీనివాస్‌కు సైతం చార్జి మెమోలు జారీ చేసినట్లు వివరించారు.

పోలీస్ రన్



జ్యోతినగర్: నగరంలో నిర్వహించిన పోలీస్ రన్‌లో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు పాల్గొన్నారు. గురువారం ఉదయం రామగుండం పోలీస్ కమిషనరేట్ నుంచి సర్వీసు రోడ్డు మీదుగా సింధూర కళాశాల రోడ్డు వరకు నిర్వహించిన పరుగులో ఏఆర్ పోలీసులు పాల్గొన్నారు. ఫిట్‌నెస్‌లో భాగంగా 5కిలోమీటర్ల పరుగు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. 90మందికి పైగా ఏఆర్ పోలీసులు ఉత్సాహంగా పరుగులో పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి



పెద్దపల్లిలో హరిదాసుల ఆటాపాటా



పెద్దపల్లి ట్రినిటి పాఠశాలలో..



జ్యోతినగర్: విశ్వభారతి విద్యాసంస్థలో..



పెద్దపల్లిరూరల్: విజేతలకు బహుమతి ప్రదానం



పాలకుర్తి : యూనివర్సల్ పాఠశాలలో..



సుల్తానాబాద్‌లో..

పెద్దపల్లిరూరల్/గోదావరిఖనిటౌన్/కాల్వశ్రీరాంపూర్/రామగిరి/సుల్తానాబాద్/ముత్తారం/పాలకుర్తి: మూడురోజుల ముచ్చటైన భోగభాగ్యాల పండుగ మకర సంక్రాంతి రానే వచ్చింది. జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల్లో ముందస్తుగా సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. చిన్నారులు ముగ్గులు వేస్తూ, భోగి మంటల నడుమ నృత్యాలు చేశారు. హరిదాసుల వేషధారణలతో విద్యార్థులు అలరించారు.



కోల్‌సిటీ: విజేతలకు బహుమతి ప్రదానం



గోదావరిఖనిటౌన్: కృష్ణవేణి పాఠశాలలో..

నిధుల దుర్వినియోగంపై కఠిన చర్యలు



ప్రజావేదికలో మాట్లాడుతున్న పీడీ శ్రీధర్

ఓదెల: ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో చేపట్టిన పనులకు కేటాయించిన నిధులు దుర్వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని డీఆర్డీఏ పీడీ శ్రీధర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఉపాధిహామీ ప్రజావేదికలో రూ1.84లక్షలు దుర్వినియోగం అయినట్లు అధికారులు పేర్కొన్నారు. గురువారం ఓదెలలో 2022–23లో జరిగిన పనులకు ఆడిట్ నిర్వహించారు. మడకలో రూ.1,31,306, కొలనూర్‌లో రూ.2965, గోపరపల్లెలో రూ.106, అబ్బిడిపల్లిలో రూ.1725, లంబాడితండాలో రూ.221, పొత్కపల్లిలో రూ.4166, రూపునారాయణపేట్‌లో రూ.6753, శానగొండలో రూ.1000, బాయమ్మపల్లెలో రూ.1275, గూడెంలో రూ.319, గుండ్లపల్లెలో రూ.899, ఇందుర్తిలో రూ.925, గుంపులలో రూ.5865, ఉప్పరపల్లెలో రూ.5883, పిట్టలఎల్లయ్యపల్లెలో రూ.1181, కొమిరలో రూ.3265, జీలకుంటలో రూ.1,678, కనగర్తిలో రూ.13,376, ఓదెలలో రూ.1,182 ఉపాధికూలీల డబ్బులు పక్కదారి పట్టినట్లు ప్రజావేదికలో వెల్లడైంది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఆర్డీఏ పీడీ మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో కూలీల పేరిట అక్రమంగా దుర్వినియోగం చేసిన డబ్బులను రికవరీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీపీ కునారపు రేణుకదేవి మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో కూలీలకు కల్పించిన పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో జి.సత్తయ్య, విజిలెన్స్ అధికారి పంజాల కొమురయ్యగౌడ్, టెక్నికల్ అసిస్టెంట్ జనార్దన్, ఏపీవో రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న జీఎం సూర్యనారాయణ

గోదావరిఖని: ఓసీపీ–3 ఈపీ ఆపరేటర్ ముదాం సత్యనారాయణ కుమారునికి రూ.6.70లక్షల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెక్కును గురువారం అందజేశారు. జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కార్మికుడి కుమారుడు రాహుల్‌కు ఆర్జీ–2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ చెక్కు అందజేశారు. ఎంబీఏ ఐఐఎం ఇండోర్‌లో సీటు సాధించిన రాహుల్‌కు రూ.10లక్షలు మంజూరు కాగా మొదటి విడతగా రూ.6.70లక్షలు అందజేసినట్లు వారు పేర్కొన్నారు. ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ జీగురు రవీందర్, డీజీఎం పర్సనల్ మురళీకృష్ణ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

★ రోడ్డుప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కమాన్‌పూర్: మండలంలోని గుండారం రాజేంద్రనగర్ వద్ద మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. యైటింక్లయిన్ కాలనీకి చెందిన అభిషేక్ తన సోదరి శ్రీవర్షతో కలిసి పెద్దపల్లి నుంచి బైక్‌పై కమాన్‌పూర్ వస్తుండగా, గుండారం గ్రామానికి చెందిన శేఖర్ బైక్‌పై పెద్దపల్లి వైపు వెళ్తున్న క్రమంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో శేఖర్ కాలి బొటనవేలు విరిగిపోగా, అభిషేక్ కాలుకు, శ్రీవర్షకు గాయాలయ్యాయి. పెద్దపల్లి వైపు వెళ్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోదరుడు ప్రమాద స్థలం వద్ద ఆగి గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో పెద్దపల్లి ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అక్కడి వైద్యులను ఫోన్ ద్వారా కోరారు.

★ గట్టెపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనం

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గట్టెపల్లి గ్రామశివారులోని పంట పొలాల్లో ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి దొంగలించారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం పంటపొలాల్లో ఏర్పాటు చేసిన రెండు ట్రాన్స్‌ఫార్మర్లను పగలకొట్టి విలువైన రాగివైర్‌ను దొంగలించారు. దీనిపై చర్యలు తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని రైతులు రాజారాం, లక్ష్మణమూర్తి, చంద్రమౌళి, ఫయాజ్, రాజ్‌కుమార్ కోరారు. సంఘటన స్థలాన్ని ఏఈ ప్రసాద్ పరిశీలించి ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ కాపర్‌వైరు విలువ రూ.20వేలు ఉంటుందని తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఏఈ పేర్కొన్నారు.

★ పోలీసుశాఖ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ పోటీలు

సుల్తానాబాద్: పెద్దపల్లి సబ్ డివిజన్ పోలీసుశాఖ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలోని సుల్తానాబాద్, జూలపల్లి, ఎలిగేడు, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల క్రీడాకారులకు బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సీఐ జగదీశ్ తెలిపారు. 12, 13వ తేదీల్లో సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 10గంటల వరకు పోలీస్‌స్టేషన్‌లో నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు 9396540067, 8688010549 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సీఐ సూచించారు.

★ జిల్లా అభివృద్ధికి పెద్దపీట వేయాలి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి జిల్లా అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించడంలో పెద్దపీట వేయాలని కాంగ్రెస్ నాయకుడు కొండి సతీశ్ గురువారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి విన్నవించారు. రాష్ట్రంలోనే పెద్దపల్లి జిల్లాకు ఉన్న ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని అందుకనుగుణంగా నిధులు కేటాయించాలన్నారు. నాయకులు రామ్మూర్తి, సంతోష్, రాజు, రాజేందర్, స్వామి తదితరులు ఉన్నారు.

★ ఉచిత వైద్యశిబిరానికి స్పందన

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని అమర్‌చంద్ కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరానికి స్పందన లభించిందని లయన్స్‌క్లబ్ ఆఫ్ పెద్దపల్లి అధ్యక్షుడు సాదుల వెంకటేశ్వర్లు తెలిపారు. వందకుపైగా మంది ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకోగా 30మందికి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించినట్లు పేర్కొన్నారు.

★ మార్కండేయకాలనీలో రెండిళ్లలో చోరీ

గోదావరిఖని: మార్కండేయకాలనీలో రెండిళ్లలో చోరీ జరిగింది. ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లిన సమయంలో గుర్తు తెలియని దొంగలు ఒకటిన్నతులాల బంగారం, రూ.40వేల నగదు ఎత్తుకెళ్లినట్లు వన్‌టౌన్ ఎస్సై సమ్మయ్య తెలిపారు. ఇంటి యజమాని అహ్మద్‌పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

★ హుస్సేన్‌కు సన్మానం

మంథని: మంథనికి చెందిన మునావర్ హుస్సేన్ జూనియర్ జడ్జిగా నియామకం కావడంపై జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో సన్మానించారు. గురువారం మంథనిలోని ఉర్దూ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు.

★ నేడు ప్రభావిత గ్రామాల ప్రజలకు వృత్తి శిక్షణ

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియా ప్రభావిత గ్రామాలైన రామగిరి మండలం సింగిరెడ్డిపల్లె, చందనాపూర్, దుబ్బపల్లి గ్రామాల మహిళలకు వృత్తి శిక్షణ తరగతులు శుక్రవారం స్థానిక సీఈఆర్ క్లబ్‌లో ఉదయం 10గంటలకు ప్రారంభిస్తున్నట్లు డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు.

★ సీఎస్ఆర్ పనుల పరిశీలన

రామగిరి: మండలంలోని రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రాంనగర్‌లో సీఎస్ఆర్ నిధులతో జరిగిన పనులను గురువారం అధికారులు పరిశీలించారు. జీఎం ఎన్.సుధాకర్ రావు ఆదేశాల మేరకు రాంనగర్‌లో రూ.20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్‌ను అధికారులు పరిశీలించారు.

★ మహిళా సంఘాలకు రూ.20లక్షలు

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లికి చెందిన మహిళా సంఘాలకు కమాన్‌పూర్ ఎస్‌బీఐ బ్యాంకు ఆధ్వర్యంలో రూ.20లక్షలు మంజూరు చేశారు. గ్రామానికి చెందిన మహిళా గ్రూపు సభ్యులు ఆర్థికంగా ఎదగడానికి లోన్ మంజూరు చేసినట్లు బ్యాంకు సిబ్బంది తెలిపారు.

మంత్రిని కలిసిన ఫార్మసీ కౌన్సిల్ సభ్యులు



మంత్రితో ఎమ్మెల్యే, ఫార్మసీ సభ్యులు

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను గురువారం పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావుతో పాటు ఇటీవల ఎన్నికైన ఫార్మసీ కౌన్సిల్ సభ్యులు మాదూరి వినోద్ కుమార్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఫార్మసీ సమస్యలు, కౌన్సిల్ సభ్యులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

లారీ యజమానుల రాస్తారోకో



రాస్తారోకో నిర్వహిస్తున్న లారీ యజమానులు

గోదావరిఖని: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిట్ అండ్‌రన్ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ లారీ యాజమానులు, డ్రైవర్లు గురువారం రాజీవ్‌రహదారి టీజంక్షన్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ రహదారిపై బైటాయించారు. అనుకోకుండా జరిగే ప్రమాదానికి రూ.7లక్షల జరిమానాతో పాటు, 10ఏళ్లపాటు జైలుశిక్ష విధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పెద్ద సంఖ్యలో లారీ ఓనర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సన్మానం



గోదావరిఖనిటౌన్: రాష్ట్రస్థాయి ఇగ్నైట్ పోటీల్లో స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులను లయన్స్‌క్లబ్ సభ్యులు గురువారం సన్మానించారు. సీనియర్ విభాగంలో అక్షయ గ్రూపు, జూనియర్ విభాగంలో నక్షత్ర గ్రూపు ప్రథమ స్థానం సాధించారు. హిందీ డిబెట్‌లో అస్మిత ద్వితీయ స్థానం సాధించింది. రాష్ట్రస్థాయి యూత్ పార్లమెంట్‌లో కరీంనగర్ రీజియన్ తరపున పాఠశాల నుంచి స్పీకర్‌గా శైలజకు రూ.27,500 నగదు బహుమతి లభించింది. ఎంపికకు కృషిచేసిన కళాశాల ప్రిన్సిపాల్ ఎం.మంజుల, సంగీతం టీచర్ శ్రీనిజ, హిందీ టీచర్ సలేహ, శ్యామల, యూత్ పార్లమెంట్ కోఆర్డినేటర్ పల్లినేని స్వప్నకు అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో చండీయాగం



పూర్ణాహుతిలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్యాంపు ఆఫీస్‌లోని మీటింగ్ హాల్‌లో చండీహోమం జరిపారు. ఎమ్మెల్యే దంపతులు పూర్ణాహుతిలో పాల్గొన్నారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతూ, నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.

ప్రజల సహకారంతో అభివృద్ధి చేస్తా



ఎలక్ట్రిక్ సైకిళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, రానున్న రోజుల్లో ప్రజల సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. కాగా గురువారం ఎమ్మెల్యే దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. సంక్రాంతి పండుగను ప్రజలు కుటుంబ సమేతంగా సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ప్రజాపాలన తీసుకొచ్చి ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి ముందుకు వెళ్తామన్నారు.

నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి



సమావేశంలో జీఎం సుధాకర్‌రావు

రామగిరి: ఆర్జీ–3 ఏరియాలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించుకోవడానికి సమష్టి కృషి చేయాలని జీఎం ఎన్.సుధాకర్‌రావు సూచించారు. గురువారం జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించడం, నిర్దేశించిన బొగ్గు రవాణా చేయడానికి సమష్టి కృషి చేయాలన్నారు. సమావేశంలో ఏరియా ఇంజనీర్ పీ.ఎలీషా, ఎస్వోటూ జీఎం జి.రఘుపతి, ప్రాజెక్టు అధికారి కె.రాజేందర్, ఏరియా సేఫ్టీ అధికారి సీ.హెచ్.వెంకటరమణ, ఏరియా సర్వే అధికారి జైనులాబుద్దీన్, ఐఈడీ, సీహెచ్‌పీ, సివిల్ డీజీఎంలు కె.చంద్రశేఖర్, కాశీ విశ్వేశ్వర్‌రావు, పద్మరాజు, పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి, ప్రాజెక్టు ఇంజనీర్లు ఆర్.శ్రీనివాస్, ఎం.నాగరాజు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి ఉద్యోగులకు యాజమాన్యం నాణ్యమైన వైద్యం అందించాలని మైనింగ్ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ మాదాసి రామ్మూర్తి డిమాండ్ చేశారు. గురువారం ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3లో సూపర్‌వైజర్ మచ్చ రమేశ్ సంతాప సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కాలు ఎముక విరిగి సింగరేణి వైద్యశాలలో చికిత్స పొందుతున్న కార్మికుడు మరణించడం వైద్యుల నిర్లక్ష్యంగానే భావించాల్సి వస్తోందన్నారు. రమేశ్ మరణంపై జ్యూడీషియల్ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సింగరేణి ఆసుపత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యులను నియమించి కార్మికులు, వారి కుటుంబాల ప్రాణరక్షణకు యాజమాన్యం చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. అధికారులు రాచర్ల రమేశ్, కె.శంకర్, నాయకులు రమేశ్, కె.శంకర్, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటి సరఫరాకు ఏర్పాట్లు



కార్యదర్శిని ప్రశ్నిస్తున్న ఎంపీడీవో జయశీల

ధర్మారం: మండల కేంద్రంలోని ఒకటో వార్డు ప్రజలకు మిషన్ భగీరథ నీటి సౌకర్యం ఏర్పాటుకు గురువారం మండలస్థాయి అధికారుల బృందం వార్డును సందర్శించింది. నీటి సరఫరా లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఆ వార్డుకు చెందిన కొత్తపల్లి వాసు వాట్సాప్ గ్రూప్‌లో వివరించారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కరించపోతే ప్రభుత్వ కార్యాలయాల్లోని నీటిని వాడుకుంటామని పేర్కొన్నారు. దీంతో స్పందించిన మండల పరిషత్ అభివృద్ధి అధికారి జయశీల, తహసీల్దార్ రజిత, ఎంపీవో రమేశ్ పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్‌బాబును వెంట తీసుకొచ్చి వార్డులోని మంచినీటి పరిస్థితిని పరిశీలించారు. మిషన్ భగీరథ నీటి సరఫరా ఈ వార్డుకు సరఫరా చేసేందుకు చేసిన ప్రయత్నాలు సఫలీకృతం కాలేదని, పైభాగంలో ఉండడంతో నీటి సరఫరా సాధ్యంకావడం లేదని కార్యదర్శి వివరించారు. దీంతో జక్కన్నపల్లికి సరఫరా చేసే మేన్ పైప్‌లైన్‌కు ఈ వార్డు సమీపంలో అదనంగా గేట్‌వాల్ ఏర్పాటు చేసి నీటి సరఫరా చేయాలని అధికారులు కార్యదర్శిని ఆదేశించారు. అప్పటి వరకు ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేయాలని ఎంపీడీవో జయశీల సూచించారు.

మోడల్ స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్



ప్రయోగాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ దీనా

ధర్మారం: మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో పాఠశాల స్థాయి టీఎంఎల్ మేళా ఎగ్జిబిషన్‌ను గురువారం నిర్వహించారు. విద్యాలయంలోని 150మంది విద్యార్థులు ఎగ్జిబిషన్‌లో సైన్స్ ప్రయోగాలు ప్రదర్శించారు. వీటిని మండలంలోని దర్మారం, నందిమేడారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు సందర్శించారు.

విద్యాలయంలో ముగ్గుల పోటీలు

సైన్స్ ఎగ్జిబిషన్ ముగిసిన తర్వత విద్యార్థులు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. ఇంటర్ సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతి నిఖిత, మంగ, ద్వితీయ బహుమతి స్వాతి, అనూష, తృతీయ బహుమతి మనోజా, వైష్ణవి, పాఠశాల స్థాయిలో ప్రథమ బహుమతి సిరిచందన, సంజీవని, ద్వితీయ బహుమతి స్పందన, హనీశ్రీ, తృతీయ బహుమతి మణిదీప్, మణిచందన నిలిచినట్లు ప్రకటించారు. బాలురలో ప్రథమ బహుమతి విఘ్నేశ్వర్, అజయ్ నిలిచారని ప్రిన్సిపాల్ ప్రకటించారు.

ప్రభావిత గ్రామాలకు పండ్ల మొక్కలు పంపిణీ



జెండా ఊపుతున్న జీఎం సూర్యనారాయణ

గోదావరిఖని: ప్రభావిత గ్రామాలకు గురువారం ఆర్జీ–2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. పండ్ల మొక్కల పంపిణీ వాహనానికి జీఎం జెండా ఊపి ప్రారంభించారు. పెంచికల్‌పేట్, సింగిరెడ్డిపల్లి, చందనాపూర్, న్యూమారేడుపాక, అల్లూరు గ్రామాలకు మొదటి విడతగా 10వేల పండ్ల మొక్కలను ఉచితంగా పంపిణీ చేశామని, రెండో విడతగా మరో 10వేల పండ్ల మొక్కలను ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ జీగురు రవీందర్, అల్లూరు కార్పొరేటర్ బాదె అంజలీదేవి, డీజీఎం పర్సనల్ జి.రాజేంద్రప్రసాద్, డీజీఎం సివిల్ ధనుంజయ, డీజీఎం ఐఈడీ మురళీకృష్ణ, పర్యావరణ అధికారి సురేశ్‌బాబు, ఫారెస్ట్ మేనేజర్ అభిలాష్, సర్వే అధికారి దేశాయినాయక్, పర్సనల్ మేనేజర్ ఎస్.అనిల్‌కుమార్, డీవైపీఎం వేణుగోపాల్ పాల్గొన్నారు.